సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం | 4 | ఫిబ్రవరి | 2025



జీవితమే క్యాన్సిల్

మానవుని జీవనశైలిలో మార్పుల కారణంగా క్యాన్సర్ వ్యాప్తి అధికమవుతోంది. వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే నయంచేసుకోవడం సులభమని వైద్యులు చెబుతున్నారు. - 8లో



చదువును దూరం చేయొద్దు

విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న నెపంతో ఊరిబడిని మూసివేసి చిన్నారులకు చదువును దూరం చేయొద్దంటూ పలు గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. - 8లో



నన్ను చంపాలని చూస్తున్నారు

పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తనను చంపాలని చూస్తున్నారని. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని పెదబొండపల్లికి చెందిన శ్రీదేవమ్మ ఆరోపించారు. - 8లో

న్యూస్‌రీల్

మిషన్ సూర్యఘర్ డ్రైవ్ చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: మిషన్ సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి, అందరూ వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా, మండల అధికారులతో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రతీ అధికారి పూర్తిస్థాయిలో ప్రజలకు సేవలందించాలన్నారు. చిన్నపాటి సమస్యలతో ప్రజలకు ఇబ్బందులు కలిగించకూడదన్నారు. కార్యాలయాల్లో సేవలు అందించే సమయాన్ని తెలియజేయాలన్నారు. పత్రికల్లో వస్తున్న వార్తలపై కచ్చితంగా స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పల్లె పండగ పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.ఎస్.శోభిక, డీఆర్వో కె.హేమలత, కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, ఐసీడీఎస్, డ్వామా పీడీలు టి.కనకదుర్గ, కె.రామచంద్రరావు, డీఈఓ ఎన్.తిరుపతినాయుడు, డీపీఓ టి.కొండలరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ కె.చలపతిరావు, ఎల్‌డీఎం విజయస్వరూప్ పాల్గొన్నారు.

పాలధరను పెంచాలి



పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ పాల రైతుల సంఘం సభ్యుల ఆందోళన

పార్వతీపురం: పాలధరను పెంచాలని ఏపీ పాల రైతుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పాడి రైతులతో కలిసి సోమవారం ఆందోళన చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు బంటు దాసు మాట్లాడుతూ పాడిరైతులకు 50 శాతం రాయితీపై పశుదాణా అందజేయాలన్నారు. పాడి పశువుల బీమా సీలింగ్ ఎత్తివేయాలన్నారు. పాల సేకరణ ధరకు, అమ్మకం ధరకు ఉన్న వ్యత్యాసం నుంచి లీటరుకు రూ.10లు రైతుల కు ఇవ్వాలన్నారు. ఏపీ డెయిరీని కంపెనీ చట్టం నుంచి 1964 సహకార చట్టంలోకి తేవాలని కోరారు. ఆందోళనలో సంగంవలస, ములగ, చినబొండపల్లి గ్రామాలకు చెందిన పాడి రైతులు పాల్గొన్నారు.

బలం లేకున్నా ▸ బల ప్రదర్శన

- పాలకొండ చైర్మన్ కుర్చీపై కూటమి నాయకుల కన్ను
- మంత్రి నుంచి ఎమ్మెల్యే వరకు రంగంలోకి..
- విప్ జారీ చేసి గట్టిగా బదులిచ్చిన వైఎస్సార్‌సీపీ
- నాటకీయ పరిణామాల మధ్య పాలకొండ నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక నేటికి వాయిదా



కౌన్సిలర్లకు ఎన్నికల నిబంధనలు వివరిస్తున్న ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సాక్షి, పార్వతీపురం మన్యం/పాలకొండ:

బలం లేకున్నా కూటమి నాయకులు బల ప్రదర్శనకు దిగారు. పాలకొండ నగర పంచాయతీ చైర్మన్ కుర్చీని ఎలాగైనా దక్కించుకోవాలని 'అధికార' బలంతో ప్రయత్నాలు చేశారు. ఇప్పటికే పోటీలో ఉన్న ప్రధాన సామాజికవర్గ అభ్యర్థిని తమవైపు తిప్పుకొన్నారు. ఎన్నిక లాంఛనమే అని భావించారు. చివరి నిమిషంలో వారి ప్రయత్నాలు బెడిసికొట్టాయి. దీంతో స్వయంగా స్థానిక ఎమ్మెల్యే కాదు.. ఏకంగా సాలూరు నుంచి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి రంగంలోకి దిగారు. ఒక సాధారణ నగర పంచాయతీ చైర్మన్ పదవి కోసం మంత్రి రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మందీమార్బలంతో పాలకొండ నగర పంచాయతీని చుట్టుముట్టి హడావిడి చేసిన కూటమి నాయకులు.. చివరకు అభాసుపాలయ్యారు. కూటమి ఎత్తుగడలను ముందే ఊహించిన వైఎస్సార్‌సీపీ నాయకులు.. ముందు జాగ్రత్తగా వ్యవహరించారు. దీంతో సోమవారం నిర్వహించాల్సిన పాలకొండ నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక మంగళవారానికి వాయిదా పడింది.

నిబంధనలే ప్రధానం..

పాలకొండ నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు విప్ జారీ చేయడంతో పార్టీ పై గెలిచిన 17 మంది నగర పంచాయతీ కౌన్సిలర్లు పార్టీ నిబంధనలకు కట్టుబడి ఉండాల్సి వచ్చింది. దీంతో నగర పంచాయతీ కార్యాలయంలో రాజకీయ పార్టీల వారీగా కౌన్సిలర్లకు సీట్లు కేటాయించారు. ఎన్నికల అధికారి యశ్వంత్‌కుమార్‌రెడ్డి నిబంధనలను సభ్యులకు వివరించారు. వైఎస్సార్‌సీపీ తరఫున 2వ వార్డు కౌన్సిలర్ ఆకుల మల్లీశ్వరిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకునేందుకు ఆ పార్టీ బీ-ఫారంతో పాటు ఫారం-2ను అందజేసినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ సీటును ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళకు కేటాయించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఎన్నుకోవాలని కౌన్సిలర్లకు ఆయన తెలిపారు. ఈ సమయంలో ఆకుల మల్లీశ్వరి మాట్లాడుతూ తాను ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేస్తున్నట్లు ప్రకటించారు. దీనిని ఎమ్మెల్యే జయకృష్ణతోపాటు టీడీపీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు సమర్థించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 14 మంది కౌన్సిలర్లు మాట్లాడుతూ.. పార్టీ తరఫున మాత్రమే పోటీలో ఉంటే మద్దతు ఇస్తామని, ఇండిపెండెంట్‌గా ఉంటే చైర్మన్ పదవి నిబంధనల ప్రకారం చెల్లదని తేల్చిచెప్పారు. దీనిపై ఎన్నికల అధికారి యశ్వంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ బీ-ఫారం అందించినందున పార్టీ తరఫునే పోటీ చేయాలని, ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేస్తే చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. అనంతరం ఆకుల మల్లీశ్వరితో కొద్దిసేపు ఎమ్మెల్యే జయకృష్ణ మంతనాలు జరిపి, తాము పోటీ నుంచి వెళ్లిపోతున్నామని.. ఈ ఎన్నిక తాత్కాలికంగా వాయిదా వేయాలని కోరారు. అనంతరం వారి మద్దతుదారులను తీసుకుని వెళ్లిపోయారు. దీనిపై ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. నగర పంచాయతీలో 19 మంది కౌన్సిలర్లతోపాటు ఒక ఎమ్మెల్యే కలిసి 20 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళ ఒక్కరే ఉండటం.. ఈ పోటీ నుంచి తాను తప్పుకుంటున్నట్లు నామినేషన్ వెనక్కి తీసుకోవడంతో చైర్మన్ ఎన్నిక మంగళవారానికి వాయిదా వేసినట్లు చెప్పారు.

నాటకీయ పరిణామాల మధ్య...

పాలకొండ నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక కోసం నెల రోజులుగా నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. వాస్తవానికి పట్టణంలో 20 వార్డు కౌన్సిలర్లు ఉండగా.. వీరిలో 17 మంది వైఎస్సార్‌సీపీకి చెందిన వారే. టీడీపీకి చెందిన వారు ముగ్గురే ఉన్నారు. 19వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ యందవ రాధాకుమారి (గత చైర్‌పర్సన్) ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. 4వ వార్డు కౌన్సిలర్ కొరికాన గంగునాయుడు గత సార్వత్రిక ఎన్నికల ముందు జనసేనలో చేరారు. 2వ వార్డు నుంచి గెలిచిన ఆకుల మల్లీశ్వరి (ఎస్సీ అభ్యర్థి) ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. దీంతో ఐదుగురు కౌన్సిలర్లు, ఒక ఎమ్మెల్యే ఓటుతో మొత్తం కూటమి తరఫున ఆరు ఓట్లు ఉండగా... అప్పటికే వైఎస్సార్‌సీపీ 14 మంది కౌన్సిలర్లతో పూర్తి మెజార్టీతో ఉంది. ఎస్సీ సామాజిక వర్గానికి నగర పంచాయతీ చైర్మన్ పదవి కేటాయించడం.. ఆ సామాజిక వర్గానికి చెందిన 2వ వార్డు కౌన్సిలర్ ఆకుల మల్లీశ్వరి ఒక్కరే ఉండడం వల్ల ఆమె ఎన్నిక లాంఛనమే అని అంతా భావించారు. ఈలోగా కూటమి నాయకులు మల్లీశ్వరిని తమ పార్టీలో చేర్చుకున్నారు. దీంతో ఎలాగైనా చైర్మన్ పదవి తమకే దక్కుతుందని కూటమి నాయకులు అనుకున్నారు. ఇందుకోసం విశ్వ ప్రయత్నాలు చేసి, చివరికి బల నిరూపణ చేయలేక చతికిలబడ్డారు. నాటకీయ పరిణామాల మధ్య పాలకొండ నగర పంచాయతీ ఎన్నిక రసవత్తరంగా మారింది.

19వ వార్డు కౌన్సిలర్ ఎన్నిక తర్వాతే చైర్మన్ ఎన్నిక జరపాలి...

నగర పంచాయతీ 19వ వార్డు కౌన్సిలర్ యందవ రాధాకుమారి (చైర్‌పర్సన్) ఉద్యోగరీత్యా తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అయితే ఇదే వార్డులో పోటీ చేసి ఓడిపోయిన ఎం.స్వర్ణరాణి రెండు రోజుల కిందట హైకోర్టును ఆశ్రయించారు. 19వ వార్డులో కౌన్సిలర్ ఎన్నిక నిర్వహించిన తర్వాతే చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిశీలనలో ఉంది. కోర్టు ఏం తీర్పు ఇస్తుందోనని అంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

మంత్రి హడావిడి

పాలకొండ నగర పంచాయతీ చైర్మన్ కుర్చీ కోసం కూటమి నాయకులు హంగామా చేశారు. ముందు రోజు రాత్రే టీడీపీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు కిడారి శ్రావణ్‌కుమార్ కిడారి శ్రావణ్ కుమార్ పాలకొండకు చేరుకుని, అందరితో మంతనాలు జరిపారు. సోమవారం ఉదయం జిల్లా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి జనసేన పార్టీ కార్యాలయానికి చేరుకుని కూటమి నాయకులతో మాట్లాడి పరిస్థితిపై ఆరా తీశారు. చైర్మన్ పదవి కూటమి అభ్యర్థికే దక్కేలా చేయాలని కూటమి నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నిక వాయిదా పడినట్లు తెలుసుకున్న మంత్రి .. నేరుగా నగర పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. బలవంతంగా గేటు తీయించి లోపలి గేటు వద్దకు చేరుకున్నారు. ఈ విషయాలను గమనించిన పోలీసులు.. మంత్రి సంధ్యారాణిని అడ్డుకున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం సభ్యులు మాత్రమే లోపలకు వెళ్లాలని, అన్యధా భావించకుండా తమ విధులకు ఆటంకం కలిగించకుండా సహకరించాలని మంత్రిని కోరారు. దీంతో మంత్రి ఇక్కడ పరిస్థితిపై రుసరుసలాడుతూ వెళ్లిపోయారు.



నేడు మరో మారు ఎన్నిక

నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక వాయిదా పడడంతో మంగళవారం మరోమారు ఎన్నిక నిర్వహిస్తామని ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ నేపథ్యంలో మంగళవారం జరగనున్న ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థి ఒక్కరే ఉన్నప్పటికీ పార్టీల మధ్య పోరులా మారింది. మంగళవారం ఇదే పరిస్థితి కొనసాగితే.. ఏం జరుగుతుందనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల అధికారి తీసుకునే నిర్ణయంపై చైర్మన్ కుర్చీ ఎవరి దక్కుతుందో తెలుస్తుంది.



ఎన్నిక కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

కేరళలో సీతంపేట రైతులు

సీతంపేట: కేరళ రాష్ట్రంలో మారిషస్ పైనాపిల్ వెరైటీ సాగును సీతంపేట రైతులు సోమవారం పరిశీలించారు. సాగు పద్ధతులను అక్కడి అధికారులు రైతులకు వివరించారు. పైనాపిల్ ప్రాసెసింగ్ యూనిట్లు పరిశీలించినట్టు ఐటీడీఏ పీహెచ్‌వో ఎస్వీ గణేష్ ఫోన్‌లో తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఓ జయశ్రీ పాల్గొన్నారన్నారు.



కేరళ పర్యటనలో ఉన్న సీతంపేట రైతులు

పెదకుదమలో ఏనుగులు



జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ గ్రామంలో సోమవారం ఏనుగులు దర్శనమిచ్చాయి. పంటలను నాశనం చేస్తూ పశువుల షెడ్డు వద్దకు చేరడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి సమయాన ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావొద్దని అటవీశాఖ సిబ్బంది గ్రామస్తులకు హెచ్చరికలు జారీ చేశారు.

మూడు ఇసుక రీచ్‌ల టెండర్లు రద్దు

పార్వతీపురం:

జిల్లాలో మూడు ఇసుక రీచ్‌లకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను రద్దు చేసినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది డిసెంబర్ 28న వంశధార, నాగావళి నదీ తీరాల్లోని పాసుకుడి, నేరడి, చినమంగళాపురం రీచ్‌లలో మాన్యువల్‌గా తవ్వకానికి, లోడింగ్ చేసేందుకు టెండర్లను ఆహ్వానించామన్నారు. తక్కువ ధరలకు టెండర్లు వేయడం, యంత్రాలతో తవ్వే అవకాశం ఉండడం, నిర్వహణలో జాప్యం తదితర కారణాలతో టెండర్లను రద్దుచేస్తూ జిల్లా స్థాయి ఇసుక కమిటీలో సోమవారం నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. టెండర్‌దారులు చెల్లించిన 10 శాతం సెక్యూరిటీ డిపాజిట్‌ను తిరిగిచెల్లిస్తామన్నారు.

తిన్నది కక్కుతారా?

- సీఆర్టీల రెగ్యులరైజేషన్ అవినీతిపై విచారణ
- ఐటీడీఏలో గుట్టుగా సాగిన ప్రక్రియ
- మూడో కంటికి తెలియకుండా 'మమ' అనిపించేయత్నం



విచారణకు హాజరైన ఉపాధ్యాయులు (సీఆర్టీలు)

సాక్షి, పార్వతీపురం మన్యం:

'చెప్పడానికి ఏమీ లేదు.. చెప్పాల్సిన అవసరం లేదు..' సీఆర్టీల రెగ్యులరైజేషన్‌లో రూ.లక్షలు దండుకున్నారన్న ఆరోపణల నేపథ్యంలో విచారణ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు పార్వతీపురం ఐటీడీఏ ఏపీవో మురళి చెప్పిన సమాధానమిది. గత ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తూ.. దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లు.. చిరుద్యోగుల నుంచి అందినకాడికి దోచుకుని రూ.లక్షలు సంపాదించుకున్న ఐటీడీఏ అధికారులు... దీనిపై విచారణను సైతం కప్పిపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. పైస్థాయి అధికారుల నుంచి కింది స్థాయి వరకు 'దండుకోవడం'లో తలో చేయి వేసిన పాపాలు బయట పడకుండా విచారణను నామమాత్రంగా ముగించేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

చిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని గత ప్రభుత్వం భావిస్తే..

ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ, జీపీఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీల సర్వీసును రెగ్యులర్ చేసేందుకు గత ప్రభుత్వం నిశ్చయించింది. సీనియారిటీ ప్రాతిపదికన 2014 జూన్ 2 నాటికి సర్వీసులో ఉన్నవారిని ప్రాతిపదికగా తీసుకుని రెగ్యులర్ చేయాలని నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. అప్పటి ప్రభుత్వం నిర్ణయంతో ఐటీడీఏ పరిధిలో ఏళ్ల తరబడి కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న సీఆర్టీలు తమకు ఉద్యోగ భద్రత కలుగుతుందని, రెగ్యులర్ ఉపాధ్యాయులుగా మారుతామని సంతోషపడ్డారు. 2023 డిసెంబర్‌లో ఇందుకు సంబంధించిన జీవో విడుదలైంది. 2024 ఏడాది మొదట్లోనే వీరిని రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మొత్తం ప్రక్రియలో ఈ అవకాశాన్ని ఐటీడీఏ అధికారుల 'సొమ్ము' చేసుకున్నారు. సూపరింటెండెంట్‌ల నుంచి కిందిస్థాయి ఉద్యోగుల వరకు తలో చేయి వేసి.. సీఆర్టీల వద్ద బేరం పెట్టినట్లు అప్పట్లో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఒక్కొక్కరి వద్ద రూ.1.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేశారని సమాచారం. లేకుంటే ఏదో కొర్రీ పెడతామని బెదిరించారు. ఉద్యోగ భద్రత మీద ఆశతో అప్పట్లో చాలామంది వీరు అడిగిన మొత్తం ఇచ్చారు. ఈ క్రమంలో ఐటీడీఏ అధికారులకు అక్రమాలకు తెర తీశారు. నిబంధనలను గాలికొదిలేశారు. 2013లో నోటిఫికేషన్ లేకుండానే తమ పలుకుబడితో పార్ట్‌టైంగా విధుల్లో చేరిన కొందరిని.. 2014 తర్వాత చేరిన ఇంకొందరిని రెగ్యులర్ చేశారు. నిబంధనల ప్రకారం బాలికల పాఠశాలలో పురుష టీచర్లను వేయకూడదు. అందుకు భిన్నంగా ముగ్గురు, నలుగురిని నియమించినట్లు తెలుస్తోంది. మొత్తంగా 133 మందిని రెగ్యులర్ చేయగా.. ఇందులో చాలావరకు అనర్హులకు అవకాశాలొచ్చి, అర్హులు అన్యాయమైపోయినట్లు అప్పట్లో కొంతమంది జిల్లా, రాష్ట్రస్థాయిలో ఫిర్యాదులు చేశారు. డబ్బులివ్వని వారికి రెగ్యులర్ చేయలేదంటూ ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో ఈ ఘటనపై విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించారు.

గతంలో ఫిర్యాదుల చేశాం..

నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు జరపడం, బాలికల పాఠశాలలో మగవారిని ఉపాధ్యాయులుగా నియమించడంపై అప్పట్లోనే ఫిర్యాదులు చేశామని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ తెలిపారు. ఐటీడీఏ అధికారులు తీసుకున్న చర్యలేవీ లేవని.. ఇప్పటికీ వారు ఆ విధంగానే కొనసాగుతున్నారని చెప్పారు. అవినీతి ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



పార్వతీపురం ఐటీడీఏ

విచారణలో దాపరికమెందుకు?

అవినీతి ఆరోపణల నేపథ్యంలో సోమవారం పార్వతీపురం ఐటీడీఏ వద్ద ఏపీవో మురళి ఆధ్వర్యంలో సీఆర్టీలను పిలిపించి విచారణ జరిపారు. ఈ ప్రక్రియ కాస్త గుట్టుగా మారింది. విషయం ఎక్కడా బయటకు పొక్కకుండా, సీఆర్టీలను ఐటీడీఏకు పిలిపించుకున్నారు. ఏపీవో మురళి, ఇతర అధికారులు ఒక్కొక్కరితోనూ మాట్లాడి వివరాలు సేకరించారు. 'డబ్బులు ఎవరికైనా ఇచ్చారా.. మీ బ్యాంక్ అకౌంట్ నంబర్, ఐఎఫ్‌సీ కోడ్ ఇవ్వండి. చెక్ చేస్తాం..' ఇదే విచారణ జరిగిన తీరు. మొత్తం 133 మంది సీఆర్టీలకు గానూ.. సోమవారం 66 మందిని పిలిచారు. మిగిలిన వారిని మంగళవారం విచారించనున్నారు. విచారణ ప్రక్రియను గుట్టుగా ఉంచేందుకు ఐటీడీఏ అధికారులు చేస్తున్న ప్రయత్నాలే విమర్శలకు ఊతమిస్తోంది. విచారణ వివరాలను మీడియాకు కూడా చెప్పేందుకు ఏపీవో, పీవో వెనుకాడటం గమనార్హం. ఇదే విషయమై ఏపీవో మురళి వద్ద 'సాక్షి' ప్రస్తావించగా.. అసలు ఇక్కడ ఏమీ జరగడం లేదని, అంతకుమించి చెప్పడానికి ఏమీ లేదని బదులిచ్చారు. సర్వీసు రెగ్యులర్ అయిన వారిని విచారణ జరపడంతో ఎక్కడ ఉద్యోగం ఊడదీస్తారోనన్న భయంతో అధికారుల ముందు కొందరు పెదవి విప్పడంలేదని తెలిసింది. పొరపాటుల అసలు విషయం చెబితే ఓ వైపు ఉద్యోగం, మరో వైపు డబ్బులు పోతాయని, మిన్నకుండడమే మంచిదన్న అభిప్రాయంలో ఉన్నట్టు సమాచారం.



పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానంలో సామూహిక అక్షరాభ్యాసాలు జరిపిస్తున్న అర్చకుడు



నక్కటపేట సాయిబాబా మందిరంలోని సరస్వతీ దేవి సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసం

సరస్వతీ నమస్తుభ్యం

వసంత పంచమి పర్వదినాన ఆలయాల్లో అక్షర మంత్రం ప్రతిధ్వనించింది. సరస్వతీ నమస్తుభ్యం అంటూ తమ పిల్లలతో తల్లిదండ్రులు అక్షరాలు దిద్దించారు. పాలకొండ కోటదుర్గమ్మ సన్నిధి, నక్కటపేట సాయిబాబా మందిరంలోని సరస్వతీదేవి ఆలయ ప్రాంగణాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు వేడుకగా సాగాయి. సర్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన కోటదుర్గమ్మకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పిల్లలతో అక్షరమంత్రం పలింపజేశారు. చదువుల తల్లి ఆశీర్వచనాలు అందజేశారు. - పాలకొండ/రూరల్

క్లుప్తంగా

నేడు శంబర పోలమాంబ మారుజాతర



శంబర పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి మారు జాతర మంగళవారం జరగనుంది. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ, సీఐ రామకృష్ణలు ఏర్పాట్లు చేపట్టారు. మంగళవారం రథసప్తమి పండగ కారణంగా భక్తుల రద్దీ తక్కువగా ఉంటుందేమోనని, అధికారులు భావిస్తున్నప్పటికీ, రద్దీ ఎక్కువైతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని. అందుకు తగ్గ ఏర్పాట్లు అధికారులు చేశారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వనంగుడి, చదురుగుడిల వద్ద క్యూలు ఏర్పాటుచేశారు. క్యూల వద్ద మంచినీటి సౌకర్యం కల్పించారు. భక్తులకు 15వేల లడ్డూ, పులిహోర ప్యాకెట్లు సిద్ధం చేశారు. సీఐ రామకృష్ణ పర్యవేక్షణలో జాతరలో భక్తులు ఇబ్బందులు పడకుండా 150మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు.

పారా అథ్లెటిక్స్‌లో గోల్డ్‌మెడల్



పారా అథ్లెటిక్స్‌లో పాల్గొన్న విద్యార్థి

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థి పి.రాజేష్ ఆదివారం మంగళగిరిలో జరిగిన పారా అథ్లెటిక్స్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. పీవీ ఈతమానుగూడ గ్రామ సర్పంచ్ కుమారుడైన విద్యార్థి ఐదోతరగతి నుంచి ఇదే పాఠశాలలో చదువుతూ క్రీడలపై ఆసక్తి కనబరుస్తున్నాడు. రాజేష్ గోల్డ్‌మెడల్ సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

జోగింపేట ప్రతిభా పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: సీతానగరం మండలంలోని జోగింపేట ప్రతిభా పాఠశాల/కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి 8వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంగ్లమాధ్యమంలో ప్రవేశానికి మార్చి 23 లోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూ గురుకులం .ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 8 వతరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం 7వ తరగతి పాస్ అయిన వారు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి 2024–25 లో 10 వతరగతి చదివి పాస్ అయి ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. తల్లిదండ్రులు, సంరక్షకుల ఆదాయం సంవత్సరానికి రూ.1,00,000లు మించి ఉండరాదని తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించడానికి ఈ నెల 3 నుంచి మార్చి 2 వరకు గడువు ఉందని, కామన్ ఎంట్రన్స్ టెస్టు మార్చి 9న జోగింపేట ప్రతిభా పాఠశాల విద్యాలయంలో ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహిస్తామని వివరించారు.

అదృశ్యమైన బాలుడి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: విజయనగరం మండలం కోరుకొండ సైనిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల ఉత్కర్ష్ బనాకా అనే విద్యార్థి తప్పిపోగా, రూరల్ పోలీసులు ఆ బాలుడిని అగర్తలాలో కనుగొని, తల్లిదండ్రులకు జిల్లా పోలీసు కార్యాలయంలో అప్పగించారు. కోరుకొండ సైనిక్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి ఉత్కర్ష్ బనాక కనిపించడం లేదని సైనిక్ స్కూల్ స్టాఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయనగరం రూరల్ పోలీసులు బాయ్ మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు విషయంలో ఎస్పీ ప్రత్యేక దృష్టి శ్రద్ధ కనబర్చి, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, స్థానిక పోలీసులను అప్రమత్తం చేసి, అన్ని విభాగాలకు అబ్బాయి వివరాలు పంపి, కేసును ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు విచారణ చేసి ఉత్కర్ష్ బనాక చివరకు అగర్తలాలో ఉన్నట్లు గుర్తించి విజయనగరం తీసుకువచ్చి తల్లిదండ్రులు మోహన్ బనాక, స్మితలకు ఎస్పీ సోమవారం అప్పగించారు.

కేన్సర్‌ను నిర్లక్ష్యం చేస్తే.. జీవితమే క్యాన్సిల్

- ఏటా పెరుగుతున్న కేసులు
- త్వరగా గుర్తిస్తే ఫలితం
- జిల్లాలో నోటి, రొమ్ము, కేన్సర్‌లు ఎక్కువగా నమోదు
- ఏడాదికి 600నుంచి 800 వరకు కొత్త కేసులు
- నేడు వరల్డ్ కేన్సర్ డే



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో బయాప్సీ పరీక్ష చేస్తున్న టెక్నీషియన్



నోటి కేన్సర్ పరీక్ష చేస్తున్న దంత వైద్యుడు



ఎఫ్ఎన్ఏసీ పరీక్ష చేస్తున్న టెక్నీషియన్

2024లో నమోదైన కేసుల వివరాలు	
ఓరల్ కేన్సర్	321
బ్రెస్ట్ కేన్సర్	233
సర్వైకల్ కేన్సర్	216

విజయనగరం ఫోర్ట్: మానవుని జీవనశైలిలో మార్పుల కారణంగా క్యాన్సర్ వ్యాప్తి అధికమవుతోంది. పూర్వీకులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల అతి తక్కువ మంది మాత్రమే క్యాన్సర్ బారిన పడేవారు. కాని నేటి మానవులు పాశ్చాత్య పోకడలకు పోయి పిజ్జాలు, బర్గర్ల వంటివి అధికంగా తినడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణంతక వ్యాధుల బారిన పడుతున్నారు. మంగళవారం వరల్డ్ కేన్సర్ డే సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. గతంతో పోల్చితే కేన్సర్ రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గ్రామాల్లో అవగాహన లేక గతంలో కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకునేవారుకాదు. దీంతో సదరు రోగులు ఏవ్యాధితో చనిపోయారో తెలిసేది కాదు. ప్రస్తుతం ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. దీంతో ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా చికిత్స చేయించుకోవాలనే అలోచన వస్తోంది. కేన్సర్ స్క్రీనింగ్ పెరగడం వల్ల వ్యాధి ఎంతమందికి ఉందో తెలుస్తోంది. చాలా మంది కేన్సర్ అనగానే భయందోళన చెందుతారు. దీని వల్ల త్వరగా చనిపోతున్నారు. కేన్సర్ వచ్చినా భయపడాల్సిన పనిలేదు. అయితే ప్రాణాంతకమైన కేన్సర్‌ను కూడా ఆత్మవిశ్వాసంతో జయించవచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు. క్యాన్సర్ వాధి పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ముప్పు వాటిల్లుతుంది. అవగాహన రాహిత్యం, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వెరసి ప్రజలు కేన్సర్ బారిన పడుతున్నారు. కాలంతో పాటు జీవనశైలిలో మార్పులు, కాలుష్యం, అలవాట్లు, ఆహార పదార్థాలు, ఇలా అనేక కారణాలు వల్ల కేన్సర్ వస్తుంది. ప్రాథమిక దశలో దానిని గుర్తించి చికిత్స పొందడం ద్వారా మరణాన్ని జయించవచ్చు. ఇప్పటికే ఎంతో మంది ఈ తరహా చికిత్స తీసుకుంటూ బతికి బయటపడ్డారు.

వ్యాధి నిర్ధారణ ఇలా..

కేన్సర్ వ్యాధిని పలు పరీక్షల ద్వారా నిర్ధారించవచ్చు. ఎఫ్ఎన్ఏసీ, పాప్సిమీర్, బయాప్సీ పరీక్షల ద్వారా వైద్యులు నిర్ధారిస్తారు. ప్రస్తుతం ఈ పరీక్షలు విజయనగరంలోని సర్వజన ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పరీక్షలను అందుబాటులోకి తెచ్చింది.

వ్యాధి లక్షణాలు

ఖైనీ, గుట్కా,పాన్ పరాగ్, డీలక్స్, పొగాకు వంటివి తినడం, పొగ తాగడం వల్ల కేన్సర్ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. నోటి, ఊపిరితిత్తుల కేన్సర్ వీటి వల్లే వస్తుంది. రొమ్ము కేన్సర్ జన్యుపరమైన కారణాలతో వస్తుంది.బయట ఫుడ్స్ తినడం వల్ల జీర్ణాశయ కేన్సర్ వస్తుంది.

నాలుగు దశలు

కేన్సర్‌లో నాలుగు దశలు ఉన్నాయి. మొదటి దశలో కేన్సర్ కణాల్ని స్క్రీనింగ్ ద్వారా గుర్తించి సరైన చికిత్స అందించవచ్చు. ఇలా చేయడం ద్వారా 95 నుంచి 100 శాతం వరకు వ్యాధినయం చేయవచ్చు. రెండో దశలో కేన్సర్ కణాలు ఒక భాగం నుంచి ఇతర భాగాలకు కొంచెం, కొంచెంగా విస్తరించడం ప్రారంభమవుతుంది. వాటికి రేడియోథెరపీ అందిస్తే 70 నుంచి 80 శాతం వరకు పూర్తి స్థాయిలో నయమవుతుంది. ఇక మూడో దశలో కేన్సర్ ఇతర భాగాలకు పూర్తిగా విస్తరిస్తుంది. రేడిథెరపీ, కీమోథెరపీ ఇస్తే 50 నుంచి 60 శాతం మందికి తగ్గుముఖం పడుతుంది. ఇక చివరి దశలో కేన్సర్ కీలకమైన అవయవాలకు సోకుతాయి. ఇలాంటి వారికి చికిత్స అందించినా ఆశించిన ఫలితం ఉండదు. కేవలం 5 నుంచి 10 శాతం మంది మాత్రమే బతికే అవకాశాలుంటాయి.

బాధితుల్లో ధైర్యం నింపాలి



కేన్సర్ అనగానే వ్యాధిగ్రస్తులు భయపడతారు. కాబట్టి కేన్సర్ సోకిన వారిలో ధైర్యం నింపాలి. కేన్సర్ వచ్చినా భయపడాల్సిన అవసరం లేదన్న విషయాన్ని చెప్పాలి. రొమ్ము కేన్సర్‌ను త్వరగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. గర్భాశయ కేన్సర్‌కు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. 11నుంచి 14 ఏళ్ల బాలికలకు గర్భాశయ కేన్సర్ రాకుండా వేసుకోవచ్చు. నెల రోజుల వ్యవధిలో రెండు డోసులు వేసుకోవాలి. 40 ఏళ్లు దాటిన మహిళలు మామో గ్రఫీ పరీక్ష చేయించుకోవాలి. బయట ఆహారం ఎక్కువగా తినకూడదు. ఖైనీ, గుట్కా, పాన్ పరాగ్, తినడం, పొగతాగడం, మద్యం తాగడం పూర్తిగా మానివేయాలి.

– డాక్టర్ పోతుల విజయలక్ష్మి, మెడికల్ అంకాలజిస్టు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

కేన్సర్‌లో రకాలు

కేన్సర్‌లో పలు రకాలు ఉన్నాయి. మహిళల్లో అధికంగా గర్భాశయ కేన్సర్, రొమ్ము కేన్సర్ సోకే అవకాశం ఉంది. పురుషుల్లోను, పొగ తాగే వారిలో గొంతు, నోటి కేన్సర్ వ్యాప్తి అధికంగా ఉంటుంది. చిన్న పిల్లల్లో బ్లడ్‌కేన్సర్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. జిల్లాలో ఏడాదికి 600 నుంచి 800 మంది వరకు కేన్సర్ బారిన పడుతున్నారు. ఈ కేసుల్లో ఎక్కువ నోటి కేన్సర్‌లే అధికంగా ఉంటున్నాయి.

బాబూ.. మా పిల్లలకు చదువును దూరం చేయొద్దు



పాఠశాలను విలీనం చేయొద్దంటూ పాలకొండ ఎంఈఓ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న చినమంగళాపురం గ్రామస్తులు

పాఠశాలల విలీనం పేరుతో మా పిల్లలకు చదువును దూరం చేయవద్దంటూ పలుచోట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఎంఈఓకు గోడు వినిపించారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఊరి బడికి ఆధునిక హంగులద్ది బలోపేతం చేస్తే.. కూటమి ప్రభుత్వం విపంచిమ్ముతోందంటూ మండిపడ్డారు. పాలకొండ మండలం చినమంగళాపురంలో 1945లో ఏర్పాటుచేసిన ప్రాథమిక పాఠశాలను ఎత్తేస్తే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పాఠశాలను ఎత్తేస్తే ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న 32 మంది విద్యార్థులు ఇబ్బందులు పడతారని, నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లి చదువుకోలేరని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు నేతృత్వంలో ఎంఈవోకు వివరించారు.

- కురుపాం మండలం కొండబారిడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను గుంజరాడ గ్రామ పాఠశాలలో విలీనం చేయవద్దంటూ కొండబారిడి గ్రామ పెద్దలు పి.నరేష్, ఐ.మంజువాణి, పి.చంద్రయ్య, పి.భాస్కరరావుతో పాటు పలువురు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పాఠశాల ఛైర్మన్‌తో పాటు పలువురు గిరిజనులు సోమవారం ఆందోళన చేశారు. 1965లో స్థాపించిన పాఠశాలను ఎలా ఎత్తేస్తారని ప్రశ్నించారు. వెంపటాపు సత్యం తదితర ఎంతో మందికి విద్యను అందించిన పాఠశాలను సంస్కరణల పేరుతో మరో పాఠశాలలో విలీనం చేయడం తగదన్నారు. విద్యార్థులు చదువుకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు.



కొండబారిడి పాఠశాలను విలీనం చేయవద్దని ఆందోళన చేస్తున్న గిరిజనులు

– పాలకొండరూరల్/ పార్వతీపురం

అక్షరాస్యతే అభివృద్ధికి కొలమానం

- వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి



విద్యార్థులకు పలకలు, విద్యా ఉపకరణాలు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి

విజయనగరం: అక్షరాస్యతే అభివృద్ధికి కొలమానమని వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి అన్నారు. వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని దాసన్నపేట వద్ద గల ప్రభుత్వ పురపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పలకలు విద్యా ఉపకరణాలు సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అక్షరాస్యతా శాతం పెరగాలని.. ఏ ప్రాంతంలో అక్షరాస్యతా శాతం ఎక్కువగా ఉంటుందో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ కొత్తలు ఎర్రినాయుడు, క్లబ్ ప్రతినిధి పప్పు విశ్వనాథం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు జి. శారద, సీహెచ్ లక్ష్మి, ఎస్. లక్ష్మి, ఎం. శాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

5న తోటపల్లిలో విగ్రహ పునఃప్రతిష్ఠ



పునఃప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం

గరుగుబిల్లి: తోటపల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 5నుంచి 8 వరకు విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ వీవీ సూర్యనారాయణ తెలిపారు. తోటపల్లిలో స్వయంభూగా వెలసిన శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి నూతన ధ్వజ, యంత్ర, శిఖర, గరుడ పరివార దేవతా సహితంగా పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని పాంచరాత్ర ఆగమ విధానంగా బ్రహ్మశ్రీ కొడవటిగంటి వేంకట నరసింహాచార్యుల పర్యవేక్షణలో, టీటీడీ వేదపండితుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 5,6,7 తేదీల్లో పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించిన తరువాత 8న వార్షిక కళ్యాణోత్సవంలో భాగంగా ఉచిత కల్యాణాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధికంగా పాల్గొనాలని కోరారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

బంగారం కోసమే హత్య

- వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ తుహిన్ సిన్హా

చోడవరం: తీవ్ర సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును ఎట్టకేలకు పోలీసులు ఛేదించారు. ముందుగా అంతా ఊహించినట్లుగానే బంగారం కోసమే మహిళను హత్య చేసినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. నెల రోజులుగా ఎంతో ఉత్కంఠగా ఉన్న ఈ కేసు మిస్టరీ వీడడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం వెల్లడించారు. నిందితుడు బంగారం కోసమే మహిళను హత్య చేసినట్లు చెప్పారు. చోడవరం మండలం లక్కవరం పంచాయతీ శివారు మారుతీనగర్ సమీపంలో గవరవరం వెళ్లే రోడ్డు పక్కన ఈ ఏడాది జనవరి 9వ తేదీన పొలంలో లక్కవరం గ్రామానికి చెందిన ఒబలరెడ్డి నరసమ్మ అనే మహిళ హత్యకు గురైంది. మేకల కోసం గడ్డి కోసేందుకు కత్తి పట్టుకుని ఆమె వెళ్లింది. గడ్డికోసం వెళ్లిన తన భార్య చీకటి పడినా రాకపోవడంతో భర్త నర్సింహమూర్తి వెతుకుతుండగా బండారు లక్ష్మయ్యకు చెందిన పొలంలో రక్తపు మడుగులో పడి ఉండడాన్ని గమనించి చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన డీఎస్పీ శ్రావణి పర్యవేక్షణలో చోడవరం ఎస్సై అప్పలరాజు, ఎస్సైలు నాగకార్తీక్‌తో కూడిన పోలీసు, ప్రత్యేక ఐటీ కోర్, క్రైమ్ పోలీసు బృందాలను రంగంలోకి దింపగా వారంతా సకాలంలో పూర్తి వివరాలు సేకరించి నిందితుడ్ని చోడవరం మండలం గజపతినగరం వద్ద సోమవారం ఉదయం పట్టుకున్నారని ఎస్పీ చెప్పారు.

నిందితుడిది కొత్తవలస

నిందితుడిని విజయనగరం జిల్లా కొత్తవలస మండలం జమ్మాదేవి పేటకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మహిళను హత్య చేసి ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారాన్ని అపహరించాడన్నారు. అపహరించిన బంగారాన్ని కొత్తవలస ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ.1.85లక్షలకు తాకట్టు పెట్టినట్టు గుర్తించామన్నారు. ఆ డబ్బులను నేరుగా నిందితుడే ఏటీఎంల ద్వారా లావాదేవీలు నిర్వహించాడని చెప్పారు. ఆ సమయంలో సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి కదలికలను గుర్తించి ఏపీతో పాటు మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో వెతికామన్నారు. నిందితుడి దగ్గర నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, ఆ సమయంలో వేసుకున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా కాగా కోర్టు రిమాండ్ విధించిందని ఎస్పీ తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ విజేతలకు అభినందన



పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన చెస్ పోటీల విజేతలకు అభినందనలు వెల్లువెత్తాయి. ఆంధ్ర చెస్ అసోసియేషన్ నేతృత్వంలో జిల్లా వేదికగా నిర్వహించిన పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. స్థానిక రింగ్‌రోడ్డులో ఉన్న ఫైర్ చెస్ స్కూల్‌లో ఆంధ్రా చెస్ అసోసియేషన్ సీఈవో కేవీ జ్వాలాముఖి ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో వందమంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో బాలురు, బాలికల విభాగంలో విజేతలకు వేర్వేరుగా నగదు బహుమతులు అందించారు. ఓపెన్ కేటగిరీలో బాలుర విభాగంలో యశ్వంత్, వెంకట రావు, మణికంఠ, కృష్ణ సాయి సూరజ్‌లు విజేతలుగా నీలవగా బాలికల విభాగంలో అనన్య, సత్య శ్రీ వల్లి, సాయిధృతి, వైష్ణవి విజేతలుగా నిలిచారు. ఈ పోటీలలో ఫైర్ చెస్ సిబ్బంది పి. అర్చన, కె. ధనలక్ష్మి, ఎ.దామోదర రావు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్స్ జిల్లా అధ్యక్షుడిగా అప్పలనాయుడు



ప్రమాణం చేస్తున్న నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: జిల్లా ల్యాబ్ టెక్నీషియన్స్ అధ్యక్షుడిగా కె. సత్యం అప్పలనాయుడు ఎన్నికయ్యారు. ఈ మేరకు స్థానిక ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ప్రాంగణంలో సోమవారం సాయింత్రం జిల్లా ల్యాబ్ టెక్నీషియన్స్, ల్యాబ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా మీసాల సూర్య శంకర్‌రావు, ఎన్నికల పరిశీలకుడిగా మహమ్మద్ దురాని వ్యవహరించారు. ఈ ఎన్నికలకు ముఖ్య అతిథిగా ఏపీఎన్‌జీఓ అసోసియేసిన్ మన్యం జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ కిశోర్, విజయనగరం జిల్లా అధ్యక్షుడు టి. శ్రీధర్ పాల్గొన్నారు. ఈ ఎన్నికలో అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వి.సావిత్రిమ్మ దేవి, ఉపాధ్యక్షులుగా పి.సి.నవీన్, పి.శివప్రసాద్, జె. సింహాచలం, వి.సురేంద్ర సాయి, ఎం. శ్రీనివాస్‌రావు, కార్యదర్శిగా ఎస్.నాగప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.బంగారునాయుడు, జాయింట్ సెక్రటరీలుగా బి.రమణ, ఎల్.చంద్రరావు, కె. ఉమామహేశ్వరావు, పి.పవన్ కుమార్ లు ఎన్నికయ్యారు.

ఆధునిక సాంకేతికతతో సైబర్ నేరాల దర్యాప్తు చేపట్టాలి



సమావేశంలో ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్: సైబర్ నేరాలపై ఆధునిక సాంకేతికతను ఉపయోగించి దర్యాప్తు చేపట్టాలని ఎస్పీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్‌సెల్, ఐటీ కోర్ టీం అధికారులు, సిబ్బంది పనితీరుపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయని, వాటివల్ల ప్రజలు కష్టపడి సంపాదించుకున్న నగదు గుర్తుతెలియని వ్యక్తులు దోచుకుంటున్నారన్నారు. సైబర్ మోసాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించి సైబరు మోసానికి గురైతే 1930కు లేదా సైబరు క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదయ్యే విధంగా ప్రజలతో చైతన్యం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ అయిన నగదు బాధితులకు అందే విధంగా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఎస్పీ కోరారు. కాలానుగుణంగా పోలీసు సిబ్బంది కూడా టెక్నాలజీ మీద పరిణితి చెందాలని సూచించారు. సమావేశంలో సోషల్ మీడియా, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రావు, ఎస్సై రవీంద్ర రాజు, సైబర్‌సెల్, ఐటీ కోర్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

నన్ను చంపాలని చూస్తున్నారు

- పార్వతీపురం ఎమ్మెల్యేపై మహిళ తీవ్ర ఆరోపణలు
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



మీడియాతో మాట్లాడుతున్న చుక్క శ్రీదేవమ్మ

పార్వతీపురం టౌన్: పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తనను చంపాలని చూస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని మండలంలోని పెద బొండపల్లి గ్రామానికి చెందిన చుక్క శ్రీదేవమ్మ తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద విలేకరులతో సోమవారం ఆమె మాట్లాడుతూ ఒక ప్రజా ప్రతినిధి అయి ఉండి అసలు విషయం తెలుసుకోకుండా భూ కబ్జాదారులకు కొమ్ము కాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, పూర్వీకుల నుంచి వస్తున్న ఆస్తులు, తాను సంపాదించిన ఆస్తులు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మార్‌నగరం, మడకవానివలస, పెదబొండపల్లి గ్రామాలకు తాను వెళ్తే చంపేయమని కొంత మందికి ఎమ్మెల్యే చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తామని చెప్పి, కనీసం మహిళలకు రక్షణ లేకుండా చేస్తున్నారని వాపోయారు. ఎన్నో సంవత్సరాలుగా తన పూర్వీకుల నుంచి వచ్చిన గ్రామంలోని తమ సొంత భూమిలో విద్యుత్ సదుపాయం పొందేందుకు భారీగా డబ్బు చెల్లించి కనెక్షన్ తెచ్చుకుని లెమన్‌గ్రాస్, పట్టుపురుగుల పెంపకం చేస్తూ ఆదర్శవంతమైన మహిళగా వ్యవసాయం చేస్తున్నానన్నారు. అక్కడే ఓ ఇల్లు నిర్మించుకున్నానని చెప్పారు. అయితే ఎమ్మెల్యే విజయచంద్ర కొంత మంది వ్యక్తులతో కలిసి వచ్చి తన ఇంటిని అక్రమంగా కూల్చివేయించారని, ఇంట్లో ఉన్న వ్యవసాయ పరికరాలు, ఫర్నిచర్, ఇతర విలువైన వస్తువులను ఎమ్మెల్యే ప్రోత్సాహంతో కొందరు దోచుకున్నారని తెలిపారు. ఇంటిని, పరిసరాలను జేసీబీ ఓనర్, డ్రైవర్ వంగపండు రమేష్ జేసీబీతో పడగొట్టారని వాపోయారు. తన భూములు పూర్వీకుల నుంచి వచ్చినవేనని, అవి ప్రభుత్వ భూములు కావని, ఆ భూమికి సంబంధించిన రికార్డులు ఉన్నాయన్నారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్కవరపుకోట: మండలంలోని అరకు–విశాఖపట్నం జాతీయ రహదారిలో గత నెల 27వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విశాఖపట్నం జిల్లా డాబాగార్డెన్స్‌కు చెందిన ఎ.మురళీకృష్ణ (43) సోమవారం మృతి చెందినట్లు ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డాబాగార్డెన్స్ నుంచి పెళ్లి కార్డులు పంచేందుకు తన ద్విచక్రవాహనంపై మురళీకృష్ణ గత నెల 27వ తేదీన ఎస్.కోట వచ్చి తిరుగు ప్రయాణంలో సీతారాంపురం గ్రామం సమీపంలో రోడ్డుపై రాంగ్ పార్కింగ్ చేసిన ఆటోను ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాల పాలవగా 108 వాహనంలో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు. ఈ మేరకు మృతుడి భార్య కనకమహలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మరో వ్యక్తి..

పాచిపెంట: మండలంలోని కర్రివలసలో గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తాకి ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామభద్రపురం మండలం గొల్లలపేట గ్రామానికి చెందిన కుంబంగి రామారావు, మండలంలోని కర్రివలస గ్రామంలో నివాసం ఉంటున్న తన చెల్లి ఇంటికి చుట్టరికానికి వచ్చి ఆమె ఇంటి వద్ద నాలుగు రోజులుగా ఐరన్ షెడ్ పనులు చేపడుతున్నాడు, అందులో భాగంగా ఆదివారం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు తన చేతిలో ఉన్న ఇనుప ఊచలు ఇంటిపైనుంచి వెళ్తున్న విద్యుత్ వైర్లను తాకడంతో షాక్‌కు గురై స్పృహ కోల్పోయాడు, వెంటనే కుటుంబసభ్యులు సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ కృపారావు తెలిపారు.



రామారావు మృతదేహం